


# ఇది నా చరితము

దిగంబర స్వాములవారి యీ 'స్వీయచరిత్ర'ని చదివే పాఠకలోకానికి నేను క్షమాపణలతో ముందుగా మనవి చేసుకోవలసిన విషయం కొంత వుంది.

స్వామిజీ స్వీయచరిత్రని ప్రకటించే నెపంతో, నేను నా స్వీయచరిత్రని కాకపోయినా – నా సొంత గోడును అచ్చులో యిరికించేందుకు ప్రయత్నిస్తున్నాని, ఎవరైనా భావించేటట్టయితే – అది ముమ్మాటికీ భ్రమాజనితం అని తెలియచేస్తున్నాను.

అసలు దీన్ని 'స్వీయచరిత్ర' అనేకన్న 'స్వీయచరిత్రాశకలం' అనిగాని – లేక అలాంటి అర్థం యిచ్చే మరో పేరుగాని పెడితే బావుండేది. కారణం – స్వామివారు స్వీయచరిత్రకు వుండవలసిన లక్షణాలుగా భావింపబడే జన్మదినం, జన్మస్థలం, బాల్యజీవితం మొదలైన భోగట్టా లేమీ యివ్వకుండా, వూరికే వారి జీవితంలో ఏదో ఒక సంఘటనా – దాని ఫలితాన్ని మాత్రం యిచ్చి వూరుకున్నారు. అలాంటిది స్వీయచరిత్ర ఎలా అవుతుంది? అయినా వారు వ్రాసిన దాంట్లో మార్పులు చేసే అధికారం నాకివ్వలేదు. వారే స్వయంగా మార్చడానికి – వారు దేహయాత్ర చాలించారు.

వారు స్వల్పమైన యీ స్వీయచరిత్రని వ్రాసిన పద్ధతిలో కూడా నాకు చాలా లోపం కనబడుతోంది. కథకు, స్వీయ చరిత్రకు భేదం వున్నదనేది అందరికీ తెలిసిన సంగతే! అయినా స్వామీజీవారు యీ చరిత్రను 'టకటక' ఏదో కథలాగా చాలా వేగంగా నడుపుకు పోయారు. అవసరం అయిన చోట్ల కూడా విపులీకరణ ఏ మాత్రం యివ్వలేదు.

సమర్థుడైన ఏ కథకుడి చేతులోగాని, నవలా రచయిత పాలగాని యీ స్వీయచరిత్ర పడివున్నట్ట యితే – వారు దీనికి కాళ్ళూ, చేతులూ, అవసరమైన అవయవాలన్నీ సృష్టించి – ఓ మహోత్కృష్టమైన రచనగా సారస్వతంలో వెలయింపచేసేవాళ్లే.... కాని.... నిజం చెప్పాలంటే, ఆ మాత్రపు పని నేనూ చేయగలను! కాని స్వాములవారి జీవితంతో కీర్తి కోసం గాని, డబ్బు కోసం గాని నేను వ్యాపారం చేయదలచుకోలేదు. ఉన్నదేదో సొంత వ్యాపారం వుండనే వుంది.

ఇది పాఠకులకీ, ప్రపంచానికీ.

పోతే నేను క్షమాపణ చెప్పుకోవలసినవారు మరికొందరున్నారు. వారిలో నా శత్రువులకు నా అభిప్రాయాలేమో బాగా తెలుసు. వాటిని వాళ్ళు ఎన్నటికీ మరిచిపోరు. అసలు మరిచిపోవడం అనేది జరిగితే, వాళ్లు శత్రువులుగా ఎందుకుంటారు? కనుక వాళ్ళకు నా అభిప్రాయాల విషయమై గుర్తుచేయవలసింది ఏమీ లేదు.

దిగంబర స్వాములవారి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నంలో వున్న కామయ్యశాస్త్రిగారికి, రోజూ వారి సమాధి దగ్గిర భజన కాలక్షేపాలు (స్వంత ఖర్చుతో) చేయిస్తూన్న కోటయ్య శ్రేష్ఠిగారికీ, అప్పటికప్పుడే స్వామివారి పేరు మీద చందాలు (ఎంతో తెలియదు) పోగుచేసిన కనకయ్య నాయుడుగారికి నేను ఒకటికి రెండుమార్లు క్షమాపణలు చెప్పుకోవలసివుంది.

వానప్రస్థాశ్రమంలో జీవితాన్ని వెళ్ళబుచ్చుతున్న నాకు ఏ కాంక్షా వుండదనీ, వుండగూడదనీ మీకు తెలుసు. ఈ వసంతకాలం అయిపోగానే భార్యను, ఆమె సౌందర్యాన్నీ – అన్నీ మరిచిపోయి – మన ప్రాంతాల్లో అడవులు లేవుగనక, నల్లమల అడవుల్లోకిగాని, రంపారణ్యాలలోకిగాని పోయి, సన్యాసాశ్రమాన్ని స్వీకరిస్తాననీ – ఆ అడవుల్లో దుష్టమృగాల నుంచి అవసరమైన రక్షణ కోసం తుపాకీ లైసెన్సు కోసం ప్రయత్నం చేయమనీ – మీకు యిదివరకే రాశాను. ఆ నా నిర్ణయానికి తిరుగులేదని మనవి చేస్తున్నాను.

స్వాములవారి స్వీయచరిత్రని బహిరంగ పరచడం వల్ల, ముఖ్యంగా వారి స్మారక చిహ్నాం కోసం మీరు చేసే ప్రయత్నాలకు పెద్ద దెబ్బ తగులుతుందని నాకు తెలుసు. అయినప్పటికీ స్వామి వారు దేహయాత్ర చాలించే ముందు యీ స్వీయచరిత్రను నాకు రిజిష్టర్డు పోస్టులో పంపుతూ, ఒకవేళ దీనిని నేను ప్రకటించకుండా నాశనం చేసేటట్టయితే – నాకు కలగబోయే స్థితీ, వారు పెట్టిన శాపాలూ, నేను నమ్మిన అందరి దేవుళ్ళ మీదా వేసిన వొట్టూ – యివన్నీ కాయితం మీద పెట్టదగినవి కాదు గనుక – మీకు స్వయంగా మనవి చేసుకుంటాను. వారి జీవిత చరిత్రని చదివి ఎవరు ఏ విధంగా అర్థం చేసుకున్నా – మనం మాత్రం ఒక తృప్తితో వుండవచ్చు. స్వామిజీ ప్రాణాన్ని వదిలే ఆఖరి నిముషంలో కూడా ఆ పరంధాముడిలో పరిపూర్ణ భక్తి విశ్వాసాలతో వున్న ట్టుగా వారే స్వయంగా వ్రాసుకున్నారు.

ఆ వొక్క మాటలో అగణిత పాపాలను హరించే శక్తి వుంది.

ఇంకా నేను చెప్పవలసింది చాలా వుంది. కాని వారి స్వీయచరిత్ర కన్నా, నా యీ వుపోద్ఘాతం

పెద్దదవుతుందేమో అన్న భీతివల్ల యింతటితో విరమించి – అన్నట్టు మొట్టమొదట్లో నే చెప్పాలనుకున్న ఓ ముఖ్య విషయం మరిచిపోయాను – దిగంబర స్వాములవారికి చనిపోయేనాటికి సరిగ్గా ఇరవై ఏడో సంవత్సరం, మొదటి పాదం జరుగుతోంది. స్వల్పజీవితంలోనే ఎన్ని ఎన్ని అద్భుతాలు....

స్వామివారి జీవితాన్ని గురించిన, నా స్వంత అభిప్రాయాన్ని పాఠకుల మీద రుద్దదలచుకోలేదు. ఇక నేను పక్కకు తప్పుకుంటున్నాను.

అదిగో వారి స్వీయచరిత్ర వారి మాటల్లోనే ప్రారంభం అవుతోంది.

❀ ❀ ❀

మృత్యువు నాకు చాలా సామీప్యంలో వుందని తోస్తోంది. దిగంబరస్వామిగా లోకానికి నేను ఎరుకపడకముందు, శారీరకంగా నేను పడ్డ కష్టాలూ, అనుభవించిన బాధలూ, నా ఆరోగ్యాన్ని పూర్తిగా దెబ్బతీసినై. ఇరవై ఏడు సంవత్సరాలైనా నిండక ముందే మరణించ వలసిన స్థితి నాకు సంప్రాప్తిస్తున్నప్పటికీ, అందుకు నేను విచారించడంలేదు. ఈ లోకపు 'కిటుకు' తెలుసుకుని, దానికి అనుగుణంగా బ్రతికాననే సంతృప్తి నాకు వుంది.

చనిపోయే యీ నిమిషాన కూడా నన్ను సృష్టించిన ఆ ఈశ్వరుడిలో సంపూర్ణమైన నమ్మకంతో, నిండు ఆస్తికుడుగా వున్నానని చెపుతున్నాను. ఈ వ్రాసేది నేను కాదనీ, నా యిచ్ఛ కూడా కాదనీ – వీటన్నిటికీ అతీతమైన మహాశక్తి మాత్రమేనని నమ్ముతున్నాను.

అసుర ప్రకృతి ముదిరి, దీర్ఘవ్యాధిగా తయారైన యీ లోకంలో, నా బ్రతుకు తెరువుకు అలాంటి విద్య చేత దాన్ని భంజించాను. స్కూలు ఫైనలు వరకు చదువుకున్న నేను కనీసం నా పొట్ట నేను పోసుకోలేక పడిన అవస్థలు చెప్పాలంటే భారత, రామాయణ, భాగవతాలు కలిపినంత గ్రంథమవుతుంది. పూనా దగ్గిర నుంచి, కలకత్తా వరకు అనేకరకాలైన వుద్యోగాలు చేస్తూ – ఎక్కడ కూడా నాలుగైదు నెలల కంటె ఎక్కువ వుండలేకపోయాను – కాదు వాళ్ళే వుండనీయలేదు.

టైపింగ్ తెలుసుకుంటే, డబుల్ ఎంట్రీ సిస్టం తెలుసా అనీ, తీరా అది కష్టపడి నేర్చుకుని వెళితే, షార్ట్‌హ్యాండ్ వచ్చిన వాడు కావాలనీ – కొన్ని చోట్ల విధేయతగా వుండలేదనీ, మరికొన్నిచోట్ల అతివిధేయత వుండలేదనీ, మరికొన్ని చోట్ల అతివిధేయత ధూర్తలక్షణం అనీ – యిలాంటి వాటితో ఎక్కడా నిలకడ లేకుండా బాధ పడ్డాను.

చిన్నప్పటి నుంచీ నాకు దేవుడి మీద, యిప్పటి లాగానే అతి భక్తి విశ్వాసాలు వున్నై. హేతుతర్క వాదాలూ, యింగితజ్ఞానం అనబడేవన్నీ అసుర ప్రకృతి లక్షణాలనీ, అసలు మానవుడు కష్టాల పాలవడం మొదలు పెట్టింది యిలాంటిది తెలుసుకున్న తరవాతనేననీ నా నమ్మకం. పరంజ్యోతిలో మనం లీనం కావాలంటే సంశయం, అనుమానం లేని ప్రశ్నారాహిత్యమైన గుడ్డి, మూఢభక్తి మాత్రమే మనం అలవరచుకోవాలని నా అభిప్రాయం. హేతువాదికి, తర్క సిద్ధాంతికి, యింగిత లౌకిక జ్ఞానాలతో కృంగిపోయేవాడికి భగవద్దర్శనం ఎన్నటికీ సాధ్యం కాదు.

అసురిక ప్రవృత్తిలో, మోసంలో జీవించే ప్రపంచం మీద ఆ శక్తుల్నే ప్రయోగించి వోడించానని చెప్పాను. అది మోసం అని ఎవరైనా భావించవచ్చు. కాని అది మోసం మాత్రం కాదు. భగవంతుడి

మీద పూర్తి విశ్వాసంతో, భక్తిశ్రద్ధలతో బ్రతికిన నేను - యీ మానవుల్ని మోసపుచ్చినంత మాత్రాన నన్ను పాపం అంటదు. నాకు ఈశ్వరుడి మీద భక్తిప్రపత్తులు వున్నై.

ఉద్యోగం పోగొట్టుకొని రెండు వందల మైళ్లు ప్రయాణం చేసి రాత్రి పది గంటలకు బెజవాడ చేరాను. నాలుగైదు రూపాయల ఖరీదుగల నా సామానంతా రైలు పెట్టెలో వదలివేసి, ఓ చింపిరి గుడ్డ గోచీగా పెట్టి, సరాసరి గేటు దగ్గిరకు వెళ్లి టికెట్ కలెక్టర్ని ఇంగ్లీషులో 'మా గురువు గారెక్కడ?' అని ప్రశ్నించాను. ఆ మానవుడు తెల్లబోయాడు. గోచీపాతరాయుడు ఇంగ్లీషు మాట్లాడటమంటే, దేవుడు స్వర్గాన్నుంచి దిగివచ్చినట్టే గదా!

రెండు మూడు నిమిషాల్లో నా చుట్టూ విపరీతంగా జనం పోగయ్యారు. వాళ్ళల్లో వాళ్ళు నన్ను గురించి అనుకునే మాటలు వింటూంటే నాకు నవ్వు మాత్రం రాలేదు. మనస్సుకు సంతృప్తి కలిగింది. ఆ రాత్రికి నన్ను ఎవరు యింటికి తీసుకుపోవాలనే విషయంలో, వాళ్ళల్లో వాళ్లు కీచు లాడుకున్నారు. చివరకు ఓ వకీలు నన్ను తన యింటికి తీసుకుపోయాడు. ఆ రాత్రి ఆయన ఎంత ప్రాధేయపడినా, నేను భోజనం చేయలేదు. మధ్యమధ్య 'మా గురువుగారెక్కడ?' అని మాత్రం ఇంగ్లీషులో ప్రశ్నించేవాడిని.

ఉదయం అక్కడ నుంచి బయలుదేరి బజారుకు వచ్చేశాను. పాపం! ఆ వకీలు నా కాళ్ళావేళ్ళాపడి తన యింట్లో వుండమని బ్రతిమాలాడు. కాని అక్కడ నేను వుండదలచు కోలేదు. కారణం - అక్కడ గోడల నిండా సాయిబాబా, హరనాథ్, వీరబ్రహ్మంగార్ల ఫోటోలు తగిలించివున్నై. అలాంటి ప్రదేశం ఎక్కువ రోజులు వుండేందుకు అనువైనది కాదని నాకు తెలుసు.

బజారున నడుస్తూ, ప్రతివాడినీ, 'మా గురువుగారెక్కడ?' అని ప్రశ్నించ ప్రారంభించాను.

నా వెంట గుంపులు గుంపులుగా ప్రజలు రావడం సాగించారు. చాలామంది భోజనానికి నన్ను, తమ యిళ్ళకు తీసుకెళ్ళాలని ప్రయత్నించారు. కాని నేను నిరాకరించాను.

మిట్టమధ్యాహ్నం అయ్యేటప్పటికి బాగా ఆకలి కాసాగింది. ఇక వూరుకుంటే లాభం లేదని హఠాత్తుగా ఒక పండ్ల దుకాణం దగ్గిరకు పోయి, అరటికాయలు గెల నుంచి లాగి తినడం ప్రారంభించాను.

నన్ను వెంబడించిన జనం నిశ్శబ్దంగా చుట్టూ నిలబడ్డారు. కొట్టువాడు, రెండు చేతులు ఎత్తి వినమ్రుడై నమస్కరిస్తూ, తదేక దృష్టితో, భక్తిభావంతో నా వంక చూస్తూ నిలబడ్డాడు. ఇంతలో ఎవరో నా భుజం మీద ఓ గ్లాస్కో పంచా, సిల్కు లాల్చీ పడవేశారు.

అక్కడే పంచ గూడకట్టుగా కట్టి, లాల్చీ తొడుక్కున్నాను. కొట్టువాడి వంక నిదానంగా చూసి ఇంగ్లీషులో 'మా గురువుగారెక్కడ?' అని ప్రశ్నించాను. వాడు తెల్లమొఖం వేసి సాష్టాంగంగా నా కాళ్ల మీద పడ్డాడు. జనంలోని కొందరు నా కాళ్లని తమ చేతుల్తో అంటుకుని కళ్లకు అద్దుకున్నారు.

అక్కడ నుంచి, మళ్ళీ, రోడ్డు వెంట బయలుదేరాను. నేను వెళుతూంటే ప్రతి కొట్టువాడు లేచి నమస్కరిస్తూ, తన కొట్టు దగ్గిరకి ఆహ్వానించేవాడే. లోపల ఎంత ఆకలిగా వున్నా - యిక ఆనాటికి దేనిజోలికి పోదలచుకోలేదు.

సాయంత్రం అయిదు గంటల దాకా అన్ని రోడ్లూ తిరిగాను. అదే ప్రశ్న అందరినీ అడిగాను. ఇక చీకటిపడబోయే వేళకు, ఎవడో అడుక్కుతినేవాడు ఒక రోడ్డు మూల నిలబడివుంటే - వాడికి లాల్చీ, పంచా విప్పి యిచ్చివేశాను.

నన్ను వెంబడించిన జనం ముక్కుల మీద వేళ్లు వేసుకున్నారు.

ఒక్క యిరవై నాలుగు గంటల్లో - గత ఆరు సంవత్సరాల నుంచీ తీరని, నా జీవిత సమస్యను పరిష్కరించుకున్నాను. ఆనాటి నుంచి యిప్పటి వరకు నీడపట్టున హాయిగా, ప్రశాంతంగా కాలం వెళ్ళబుచ్చాను.

నా బంధువులూ, స్నేహితులూ, ఎందరో వచ్చారు. నేను వాళ్ళెవర్నీ గుర్తుపట్టలేదు - అసలు గుర్తుపట్టదలచుకోలేదు. నా కష్టకాలంలో వీళ్ళందరూ నా అసమర్ధతను వెక్కిరించినవాళ్లేగాని, సహాయం చేసిన వాళ్ళు ఒకరూ లేరు. ఆఖరికి ఏ ప్రాణమిత్రుడికైతే యీ నా స్వీయచరిత్రని ప్రకటించే భారం ఒప్పచెపుతున్నానో, అతడిని కూడా గుర్తుపట్టకుండా - అందరినీ అడిగినట్టే - 'మా గురువుగారెక్కడ?' అని అడిగాను. దానితో అతడు కళ్ళవెంట నీళ్ళు పెట్టి 'ఋషి! మహాభక్తుడు! భారతదేశం తన ఆధ్యాత్మిక శక్తిని గోల్పోలేదు. ఇలాంటి మహాఋషుల ద్వారా భారతదేశం ప్రపంచానికి మరోమారు వెలుగు చూపెడుతుంది. ఈయన నా సహాధ్యాయి! ప్రాణమిత్రుడు!' అంటూ బావురుమన్నాడు.

ఆ నిమిషాన నేనూ కరిగిపోయాను. వీడికొక్కడికి నిజం చెప్పుదామనుకున్నాను. కాని అంతలోనే - అలాంటి చర్య వల్ల రాబోయే దుష్ఫలితాన్ని ఆలోచించి మానుకున్నాను.

ఈనాటి వరకు జీవితం చాలా సుఖప్రదంగా గడిచిపోయింది. నేను ఎవరికిగాని బోధించిన వేదాంతజ్ఞానం ఏమీ లేదు. నన్ను చూడడానికి వచ్చిన ప్రతీవాణ్ణి ఇంగ్లీషులో ఆ పాత ప్రశ్ననే - 'మా గురువుగారెక్కడ?' - అని మాత్రం అడిగేవాడిని.

నేను వుంటున్న యీ యిల్లూ, చుట్టూ వున్న నాలుగెకరాల తోటా నా మరణానంతరం ఎవరు అనుభవించినా నా కొకటే. నా శిష్యబృందంలో ఎవరూ నా స్థానాన్ని ఆక్రమించేవాళ్ళు లేరు. వాళ్ళందరూ బాగా ఆస్తి వుండి, భక్తి భావంతో నాకు సేవచేయడానికి చేరిన వాళ్ళే.

ఒక నిలకడగా బ్రతికే తెరువులేక, జీవితంలో యిదివరకు నాలాగా, నానా బాధలూ పడుతూన్న వాడెవడైనా వస్తే - అలాంటి వాడికి నా స్థానాన్ని ఒప్పచెప్పి మరణిద్దామని వుంది. కాని యీ నిమిషం వరకు అలాంటి వ్యర్థజీవి ఎవడూ నా దగ్గిరకు రాలేదు.

ఇది నా స్వీయచరిత్ర! లోకం నా చదువునీ, తెలిసిన పనినీ వుపయోగించుకుని నన్ను బ్రతకనియ్యలేదు. అందుకని - దాని అజ్ఞానాన్నీ, మూఢత్వాన్ని వుపయోగించుకుని నేను బ్రతికాను.

నేను దేవుడిలో నమ్మకం వుంచి - మానవుణ్ని మోసగించాను. దేవుడితో పోల్చి చూసినపుడు - యీ క్షుద్రమానవుడేపాటి! - దిగంబరస్వామి!

❋

*(తెలుగు స్వతంత్ర : 11-3-1949)*